

సమస్యలతో సహవాసం

కాగజ్‌నగర్ మండలం జీడిచేను గ్రామంలో సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ 150 కుటుంబాల వరకు నివాసం ఉంటున్నాయి. 9లో▸



'గృహలక్ష్మి' కోసం బారులు

గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు చివరిరోజు గురువారం ప్రజలు కార్యాలయాల్లో బారులు తీరారు. మీసేవ, జిరాక్స్ సెంటర్లలో రద్దీ కనిపించింది. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.3 /26.3

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ కారణంగా వేడిగా, ఉక్కపోతగా అనిపిస్తుంది. అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముగ్గురు ఎస్సైల అటాచ్‌మెంట్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు ఎస్సైలను ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్లకు అటాచ్ చేస్తూ ఎస్పీ సురేశ్‌కుమార్ మెమో జారీ చేశారు. డీఎస్‌బీ ఆసిఫాబాద్‌లో పనిచేస్తున్న ఎస్సై రాజేశ్వర్‌ను ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు, సీసీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సైలు శ్రీకాంత్, సీహెచ్ గంగన్నను కాగజ్‌నగర్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయా స్టేషన్లలో వెంటనే రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఒక్కరోజే 19 దరఖాస్తులు

ఆసిఫాబాద్: జిల్లాలోని మద్యం దుకాణాలకు గురువారం ఒక్కరోజే 19 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ తెలిపారు. కాగజ్‌నగర్ 1, ఆసిఫాబాద్‌లో 18 దరఖాస్తులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. దీంతో మొత్తం దరఖాస్తుల సంఖ్య 25కు చేరింది.

'హర్ ఘర్ తిరంగా' ఉద్దేశాన్ని చాటి చెప్పాలి



జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, తపాలాశాఖ సిబ్బంది

ఆసిఫాబాద్: దేశ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఉద్దేశాన్ని ప్రజలకు చాటి చెప్పాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ చాంబర్‌లో గురువారం తపాలా శాఖ కాగజ్‌నగర్ సబ్ డివిజనల్ అధికారి సతీశ్‌తో కలిసి జాతీయ పతాకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేసి జాతీయ భావాన్ని చాటి చెప్పాలన్నారు. తపాలా కార్యాలయంలో రూ.25 చెల్లించి జాతీయ పతాకాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తపాలాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఐఏఎస్ మృతికి సంతాపం

ఆసిఫాబాద్: సీనియర్ ఐఏఎస్ అధికారి దేబబ్రద కంత మృతిపై విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కర్నాగౌడ్ గురువారం సంతాపం ప్రకటించారు. గతంలో కరీంనగర్ కలెక్టర్, ఆసిఫాబాద్ సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన దేబబ్రత కంత ఒరిస్సాలో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో పట్టణంలోని విశ్రాంత ఉద్యోగులు సంతాపం తెలిపారు. కాగా.. అప్పటి ఆసిఫాబాద్ డివిజన్ కేంద్రంలో నిక్కచ్చిగా విధులు వ్యవహరిస్తారనే దేబబ్రద కంతకు పొందారు. పట్టణంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించిన కాలనీకి 'కంత కాలనీ'గా నామకరణం చేశారు. ఇప్పటికీ కంత కాలనీగానే కొనసాగుతోంది.

యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం చేస్తామని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు అన్నారు. జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ భవనంలో గురువారం సంఘం ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు ఒకే ఉమ్మడి వేదిక ఉండాలనే ఉద్దేశంతో 1974లో యూటీఎఫ్ ఏర్పడిందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల పక్షాన నిలబడి అనేక సమస్యలను పరిష్కరించిన ఘనత తమకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఐక్య గురుకుల రాష్ట్ర కన్వీనర్ ఎల్లయ్య, యూటీఎఫ్ సంఘం నాయకులు హేమంత్, ఉపేందర్, తిరుపతి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయాలి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నా విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు కోరారు. జిల్లా కేంద్రంలో గురువారం ధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు హేమంత్, తిరుపతి, ఉపేందర్ ఉన్నారు.

ఉపాధిలో ఉన్నతి



వాంకిడిలో ఉపాధిహామీ కూలీల వివరాలు సేకరిస్తున్న అధికారులు (ఫైల్)

- కూలీలకు వృత్తి నైపుణ్య శిక్షణ
- జాబ్‌కార్డు ఉన్న వారి వివరాలు సేకరిస్తున్న జిల్లా యంత్రాంగం
- వంద రోజులు పూర్తిచేసుకున్న కూలీలకు ప్రాధాన్యత
- ఇప్పటికే 822 మంది ఎంపిక

వాంకిడి(ఆసిఫాబాద్): ఉపాధిహామీ కూలీలకు ఏడాది పొడువున ఉపాధి కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఆసక్తి గల కూలీలకు వివిధ రంగాల్లో ఉచిత శిక్షణ కల్పించి స్వయం ఉపాధి పొందేందుకు అవకాశం కల్పిస్తోంది. ఇప్పటివరకు ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న కూలీలు మట్టి పని మాత్రమే చేసేందుకు అవకాశం ఉండగా, వంద రోజుల పనిదినాలు పూర్తయితే ఇంటికే పరిమితమయ్యేవారు. ఇలాంటి వారికి స్వయం ఉపాధి రంగాలపై శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా 'ఉన్నతి' పేరుతో జిల్లాల వారీగా నైపుణ్య శిక్షణపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఆసక్తి ఉన్న కూలీల వివరాలు సేకరిస్తున్నారు.

స్వయం ఉపాధి దిశగా..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 1.21 లక్షల జాబ్ కార్డులు ఉండగా 2.45 లక్షల మంది ఉపాధి కూలీలు ఉన్నారు. 2019- 20 ఆర్థిక సంవత్సరంలో 3,802 జాబ్ కార్డుదారులు, 2020- 21లో 8,067, 2021- 22లో 9,087, 2022- 23లో 1,136 మంది జాబ్‌కార్డు దారులు వందరోజుల పనిదినాలు పూర్తి చేసుకున్నారు. ప్రస్తుతం 2023- 24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 375 మంది వందరోజుల పనిదినాలు పూర్తిచేశారు. ఇలాంటి వారికి వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇస్తే ఏడాది పాటు ఉపాధి పొందే అవకాశం ఉందని ప్రభుత్వం యోచిస్తోంది.

తొలివిడత శిక్షణకు ఎంపిక పూర్తి..

మూడేళ్లలో ఉపాధిహామీ పనులకు వెళ్లి వంద రోజులు పని పూర్తి చేసుకున్న వారిలో ఆసక్తి ఉన్న కూలీలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఉపాధి శిక్షణకు ఈ ఏడాదిలో ఇప్పటికే 822 మందిని ఎంపిక చేశారు. వారి ఆసక్తి మేరకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. ఎంపికైన వారిని విడతల వారీగా శిక్షణ కేంద్రాలకు పంపించి ఎంచుకున్న రంగంలో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే శిక్షణ పొందిన వారికి రుణ సాయం అందించాలని నిర్ణయించారు. పరికరాల కొనుగోలు, దుకాణాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ముద్రా, తదితర పథకాల నుంచి రుణసాయం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎంపికైన అభ్యర్థులను ఉట్నూరులోని స్వయం ఉపాధి శిక్షణ కేంద్రానికి పంపిస్తారు. ఎంపికైన ప్రతీఒక్కరికి శిక్షణ కాలంలో ఉపాధిహామీ పథకంలో మాదిరి రోజువారీ కూలి రూ.273 చెల్లిస్తారు. ఎంచుకున్న రంగానికి అనుగుణంగా15 నుంచి 45 రోజులపాటు శిక్షణ కొనసాగనుంది.

జిల్లా వివరాలు

మండలాలు	15
గ్రామ పంచాయతీలు	335
జాబ్‌కార్డులు	1.21 లక్షలు
కూలీలు	2.45 లక్షలు
పనిచేస్తున్న వారు	1.71 లక్షలు

వందరోజుల పనిదినాలు పూర్తిచేసిన వారు

2019- 20	3,802
2020- 21	8,067
2021- 22	9,087
2022- 23	1,136

డిమాండ్ ఉన్న రంగాల్లో కూలీలకు శిక్షణ ఇప్పిస్తే స్వయం ఉపాధి పొందుతారనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ 'ఉన్నతి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

పలు రంగాల్లో శిక్షణ..

ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఆసక్తి మేరకు పలు రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. పురుషులకు ఎలక్ట్రీషియన్, ప్లంబర్, మేస్త్రీ, కంప్యూటర్, టూవీల్లర్ మెకానిక్, వైరింగ్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ తదితర రంగాల్లో, మహిళలకు అప్పడాల తయారీ, అల్లికలు, మొక్కల పెంపకం, పచ్చళ్లు, మగ్గం వంటి తదితర స్వయం ఉపాధి పొందేలా శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లభించే వాటికి ప్రాధాన్యమిచ్చి ప్రోత్సహించాలని నిర్ణయించారు. ఇప్పటికే మహిళా సంఘాల్లోని సభ్యులకు ఆయా రంగాల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు రుణ సదుపాయం పొందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇదే తరహాలో ఉపాధిహామీ కూలీలు లబ్ధి పొందేలా నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఉపాధిహామీ కూలీలు ఏడాది పొడవున ఉపాధి పొందేలా కేంద్ర ప్రభుత్వం 'ఉన్నతి' కార్యక్రమాన్ని తీసుకువచ్చింది. ఈ కార్యక్రమం ద్వారా ఉపాధిహామీ పథకంలో కల్పించే వంద రోజుల పని దినాలను పూర్తి చేసిన కూలీలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. కూలీల ఆసక్తి మేరకు పలు రంగాల్లో శిక్షణ అందిస్తున్నాం. జిల్లాలో అర్హులైన 822 మందిని తొలి విడతకు ఎంపిక చేశాం. దశల వారీగా వారికి శిక్షణ ఉంటుంది. అర్హులైన కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తులో సుస్థిర అభివృద్ధి సాధించవచ్చు.

– సురేందర్, డీఆర్‌డీవో

ఆదివాసీల అభ్యున్నతికి కృషి

- జిల్లాలో గిరిజన విద్యను బలోపేతం చేస్తాం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో డీటీడీవో రమాదేవి



ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేస్తానని డీటీడీవో(డిస్ట్రిక్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) రమాదేవి అన్నారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆమె గురువారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. అడవుల జిల్లాలో సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు చేరేందుకు చర్యలు తీసుకుంటానని అన్నారు. మారుమూల గ్రామాల్లో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో సదుపాయాలు మెరుగుపరిచి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

సాక్షి: డీటీడీవోగా జిల్లాకు రావడం ఎలా ఉంది. ప్రజలకు ఏ విధమైన సేవలందిస్తారు?

డీటీడీవో: పోరాట యోధుడు కుమురంభీం పుట్టిన జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా. జిల్లాలో ప్రతీ గిరిజన పాఠశాలను సందర్శించి విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడమే ప్రథమ లక్ష్యం.

సాక్షి: గిరిజన విద్య బలోపేతానికి తీసుకునే చర్యలేంటి?

డీటీడీవో: గిరిజన సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వసతిగృహాలు, పాఠశాలలను తరచూ విజిట్ చేస్తా. ఎఫ్ఏ- 1లో మార్కుల ఆధారంగా చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక గ్రూపులు ఏర్పాటు చేస్తాం. వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ అభ్యసన సామర్థ్యాలు పెంచుతాం. ఏటీడీవో పరిధిలోని పాఠశాలలను పర్యవేక్షిస్తూ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

సాక్షి: వర్షాకాలంలో వసతి గృహాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు?

డీటీడీవో: వర్షాకాలంలో విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అన్ని వసతిగృహాల్లోని ఆర్‌వో వాటర్ ప్లాంట్లకు మరమ్మతులు చేయించాం. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నాం. చిన్నచిన్న మరమ్మతుల కోసం ఒక్కో పాఠశాలకు రూ.25వేలు కేటాయించాం. ఆర్‌బీకే వైద్య బృందం ప్రతీవారం ఆశ్రమాల్లో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు. విషజ్వరాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని వార్డెన్లు, హెచ్‌ఎంలు, ఏఎన్‌ఎంలను ఆదేశించాం.

సాక్షి: జిల్లాలో మొత్తం ఎన్ని గిరిజన పాఠశాలలు ఉన్నాయి.. ఎంత మంది చదువుకుంటున్నారు?

డీటీడీవో: జిల్లా వ్యాప్తంగా 46 గిరిజన పాఠశాలలు, నాలుగు వసతి గృహాలు ఉన్నాయి. 11,666 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 500 మంది వరకు ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ ఏడాది పదో తరగతిలో గిరిజన విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేశాం. తల్లిదండ్రులు సహకరించి విద్యార్థులను పాఠశాలలకు పంపించాలి. వసతిగృహాల్లో చదువుతున్న వారిని చిన్నచిన్న పండుగలకు ఇంటికి తీసుకెళ్లొద్దు. వారుచదువుపై దృష్టి సారించేలా ప్రోత్సహించాలి.

సాక్షి: గిరిజన శాఖలో సీఆర్‌టీ, ఏఎన్‌ఎంల నియామకంలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై మీరేమంటారు?

డీటీడీవో: నేను జిల్లాలో బాధ్యతలు స్వీకరించక ముందే ఆ నియామక ప్రక్రియ చేపట్టారు. గతంలో ఉన్న అధికారి హయాంలో జరిగిన నియామకాల్లో అనుభవం ఉన్న వారికే ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇక నుంచి చేపట్టే నియామయాల్లో పారదర్శకత పాటిస్తాం. అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

కూడళ్లలో మట్టిదీపాల ప్రదర్శన, ప్రతిజ్ఞ

కాగజ్‌నగర్‌టౌన్: నా మట్టి- నా దేశం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11, 12 తేదీల్లో ప్రతీ గ్రామంలోని కూడళ్లలో మట్టిదీపాల ప్రదర్శనలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరీశ్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఆయన నివాసంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మేరీ మాటి- మేరా దేశ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఈ నెల 13న ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రతీ గ్రామంలో 75 మొక్కలు నాటాలని సూచించారు. 13, 14, 15 తేదీల్లో ఇళ్లు, కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో జాతీయ జెండా ఆవిష్కరించాలన్నారు. 16 నుంచి 26 వరకు గ్రామాల నుంచి మట్టిని సేకరించి ఢిల్లీకి పంపించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బోదకాలు నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాత్రలు వేసుకుంటున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఆసిఫాబాద్: జిల్లాలో బోదకాలు వ్యాధి నిర్మూలనకు వైద్యారోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో గురువారం ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి బోదకాలు వ్యాధి నిర్మూలనకు అల్బెండజోల్ మాత్రలు మింగించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు కూడా మాత్రలు వేసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఈ మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మలేరియా జోనల్ అధికారి సునీల్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బృందాల పర్యటన



నంబాలలో సెగ్రిగేషన్ షెడ్డు పరిశీలిస్తున్న సభ్యులు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని నంబాల, కొమురవెల్లి గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం అధికారి శ్యామ్ గురువారం పర్యటించారు. పారిశుధ్య పనులు, మరుగుదొడ్డి, ఇంకుడు గుంతలు, సెగ్రిగేషన్ షెడ్లు, నర్సరీలు, వాటిలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. బృందం సభ్యులు రాకేశ్, ప్రశాంత్, జిల్లా కోఆర్డినేటర్ ఫణికుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అంజద్ పాషా, ఏపీవో బుచ్చన్న, సర్పంచులు చిన్న సోమశేఖర్, శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని సిర్పూర్(టి), వెంకట్రావ్‌పేట్, హుడ్కిలి గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం సభ్యులు గురువారం తనిఖీలు చేపట్టారు. సభ్యులు వెంకటేశ్, నవీన్, సునీల్, ఈవో కృష్ణమూర్తి, సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు మరింత చేరువ కావాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్



తనిఖీ చేస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పోలీసులు ప్రజలకు మరింత చేరువ కావాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. పోలీసు అధికారులు తమ పరిధిలోని అన్ని గ్రామాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. నేరాల దర్యాప్తులో సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. డీఎస్పీ కరుణాకర్, రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై సోనియా ఉన్నారు.

బడిగంట @9.30

- పాఠశాలల పనివేళలను సవరించిన ప్రభుత్వం
- అన్ని స్కూళ్లు ఒకే సమయానికి తెరుచుకునేలా ఉత్తర్వులు
- ప్రాథమిక స్థాయి విద్యార్థులకు కాస్త ఊరట



రెబ్బెన(ఆసిఫాబాద్): బడి పనివేళలను రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. గతంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పాఠశాలల ప్రారంభ సమయం, ముగింపు సమయం వేర్వేరుగా ఉండేది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలతో పోల్చితే ఉన్నత పాఠశాలల విద్యార్థులకు కాస్త ఆలస్యంగా స్కూల్ ప్రారంభమై, ఆలస్యంగానే ముగిసేది. దీంతో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు ముందుగా బడికి చేరుకోవాల్సి వచ్చేది. ఉదయం పూట తొందరగా నిద్రలేవలేక విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. అన్ని స్కూళ్లకు పనివేళలు ఒకేవిధంగా ఉండాలని కొన్నేళ్లు ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి పాఠశాలల పనివేళల్లో మార్పులు చేసింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల పనివేళలను మారుస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది.

ప్రాథమిక విద్యార్థులకు ఊరట

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల పనివేళలను మార్చడంతో ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఊరట లభించింది. పనివేళల మార్పునకు ముందు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఉదయం 9 గంటలకే ప్రారంభమయ్యేవి. ఉన్నత పాఠశాలలు మాత్రం 9.30 తెరుచుకునేవి. సాధారణంగా చిన్నపిల్లలు ఉదయం పూట త్వరగా మేలుకునేందుకు ఇంట్లో మారం చేస్తుంటారు. పిల్లలను బుజ్జగించి నిద్ర నుంచి లేపేందుకు తల్లిదండ్రులు పడరాని పాట్లు పడుతుంటారు. ఉదయం 7 గంటల తర్వాత నిద్రలేచే చిన్నారులను రెడీ చేసి సకాలంలో పాఠశాలకు పంపడం తలకు మించిన భారంగా మారేది. తల్లిదండ్రుల సాయం లేకుండానే నిద్ర లేచి స్వతహాగా తయారయ్యే ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉదయం 9.30కు పాఠశాల ఉండటంతో వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9 గంటలకు తెరుచుకోవడంతో చిన్నారులు ఇబ్బందులకు గురయ్యేవారు. దూరప్రాంతాల్లో చదువుకునే వారయితే ఉదయం 8 గంటలలోపే ఇంటి నుంచి బయలుదేరాలి. ఈ సమస్యలకు పరిష్కారంగా అన్నిస్కూళ్ల పనివేళలు ఒకే విధంగా ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక మేరకు ప్రభుత్వం పనివేళలు మార్చింది. అన్ని రకాల పాఠశాలలు ఉదయం 9.30 గంటలకే తెరుచుకునేలా రాష్ట్ర విద్యాశాఖ ఇటీవలే ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో జిల్లాలోని అన్ని పాఠశాలలు కొద్దిరోజులుగా ఉదయం 9.30 గంటలకే తెరుచుకుంటున్నాయి.

ముగింపు సమయాలు మాత్రం వేరు..

జిల్లాలోని అన్ని పాఠశాలలు ఉదయం ఒకే సమయానికి తెరుచుకుంటున్నా ముగింపు సమయాలు మాత్రం వేరుగా ఉన్నాయి. సవరించిన పనివేళలకు ముందు ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు, ప్రాథమికోన్నత పాఠశాలలు 9 నుంచి సాయంత్రం 4.30 వరకు, ఉన్నత పాఠశాలలు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.45 వరకు పని చేసేవి. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.15 వరకు, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.45 వరకు కొనసాగుతుండగా ఉన్నత పాఠశాలల పనివేళల్లో మాత్రం ఎలాంటి మార్పు లేదు. ఉన్నత పాఠశాలల విద్యార్థులతో పోల్చితే ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఉదయం పూట అరగంట వెసులుబాటు కలిగేలా పనివేళలను సవరించటంతో వారికి కాస్త ఊరట లభించినట్టైంది. దూర ప్రాంతాలకు వెళ్లే వారు సకాలంలో స్కూల్‌కు చేరుకునేందుకు ఆస్కారం ఉంటుంది. మధ్యాహ్నం భోజనం వరకు ఆకలితో అలమటించకుండా తల్లిదండ్రులు చిన్నారులకు అల్పాహారం అందించేందుకు సమయం దొరికింది.

జిల్లాలోని పాఠశాలలు (ప్రభుత్వ, ప్రైవేట్)

ప్రాథమిక	908
ప్రాథమికోన్నత	192
ఉన్నత	145
హైయర్ సెకండరీ గ్రేడ్ పాఠశాలలు	24
మొత్తం విద్యార్థులు	92,701 (సుమారు)

నిధులు కేటాయించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న టీఎన్‌జీవో నాయకులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో టీఎన్‌జీవో భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతూ ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే ఆత్రం సక్కును కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. రూ.5 లక్షలు విరాళం ఇస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు సంఘం ప్రతినిధులు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ లింగాల రాజశేఖర్, గౌరవ సభ్యుడు సిడాం పోచయ్య, సభ్యులు సీహెచ్ వసంత్, మధుకర్, పొన్న కుమార్, హుస్సేన్, కీర్తిపాల్ రవీందర్, కృష్ణ, సతీశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టమాటా వ్యాన్ బోల్తా



బోల్తా పడిన టమాటా వ్యాన్

ఆసిఫాబాద్‌రూరల్: బెంగళూర్ నుంచి ఛత్తీస్‌గఢ్‌కు టమాటా లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ గురువారం బూర్గుడ సమీపంలో బోల్తా పడింది. యూటర్న్ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. బైక్‌పై వస్తున్న బాపు, అతని భార్య సోని కిందపడడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని ఒకరు బలవన్మరణం

లక్సెట్టిపేట(మంచిర్యాల): కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. రెండవ ఎస్సై రామయ్య తెలిపిన వివరాల ప్రకారం.. లక్సెట్టిపేటకు చెందిన వరప్రసాద్ (40) ఏపని చేయకుండా ఖాళీగా తిరుగుతుండేవాడు. దీంతో ఇంట్లో గొడవలు జరుగుతుండడంతో అతని భార్య మంచిర్యాలలోని పుట్టింటికి వెళ్లిపోయింది. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని తల్లి శాంతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దేశీదారు స్వాధీనం

సిర్పూర్(టి): మండలంలోని టోంకినిలో గురువారం అక్రమంగా నిల్వ ఉంచిన దేశీదారు మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై డీకొండ రమేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన చౌదరి భరత్ మహారాష్ట్ర నుండి మద్యం తీసుకుని వచ్చి విక్రయిస్తున్నాడని తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా రూ.6వేల విలువైన 120 మద్యం సీసాలు లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్

మంచిర్యాలటౌన్: తెలంగాణ ప్రభుత్వం, ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ 2023–24కు గాను మంచిర్యాల జిల్లా నుంచి 17 అంశాలలో క్రీడలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్, క్యారమ్స్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, గ్రీక్ రోమన్, బెస్ట్ ఫిజిక్‌లో పాల్గొనేందుకు ప్రభుత్వ అవకాశం కల్పించిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయం, ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్ మంచిర్యాలలో ఈ నెల 16న జరిగే జిల్లాస్థాయి ఎంపిక పోటీలలో పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9440141328 నంబరులో సంప్రదించాలన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

కోటపల్లి(చెన్నూర్): మండలంలోని దేవులవాడ గ్రామానికి చెందిన బెల్లంపల్లి స్వప్న పురిటినొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. అంబులెన్సులో చెన్నూర్‌కు తీసుకువస్తుండగా మార్గమధ్యంలో పురిటినొప్పులు అధికం కావడంతో ఈఎంటీ షాబాజ్, పైలెట్ ముజమిల్ ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రసవం చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది.

జాగ్రత్తలతో పంటలు ప్రాణాలు సురక్షితం

- పురుగు మందులతో పొంచి ఉన్న ప్రమాదం
- పిచికారీ చేసేటప్పుడు రక్షణ చర్యలు పాటించాలి
- వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్



రసాయనిక మందు పిచికారీ చేస్తున్న రైతు

మంచిర్యాలఅగ్రికల్చర్: తొలకరి వర్షాలకు విత్తుకున్న పంటలు ప్రస్తుతం ఎదిగే దశలో ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి, సోయా, కంది పంటలను తెగుళ్లు, చీడపీడలు ఆశిస్తున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు కలుపు నివారణ, పురుగుల వ్యాప్తిని నివారించేందుకు చర్యలు చేపడుతున్నారు. పురుగు మందులు అంటేనే ప్రమాదకరంగా ఉంటాయి. అవి మన శరీరంలోకి వెళ్లినా.. గాలి ద్వారా పీల్చినా ఆరోగ్యానికి హానికరమే. పిచికారీ చేయడంలో అవగాహన లేకపోవడం.. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల రైతులు, వ్యవసాయ కూలీలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. గతేడాది ఉమ్మడి జిల్లాలో పంటకు పురుగుల మందు పిచికారీ చేసి ఇంటికి వచ్చి విషప్రభావంతో ఏడుగురు మృతి చెందగా మరో 25 మంది అస్వస్థతకు గురయ్యారు. అనేక మంది అనారోగ్యానికి గురయ్యారు. ఇలాంటి ఘటనలు ప్రతీ సీజన్‌లో చోటు చేసుకుంటూనే ఉన్నాయి. పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు రక్షణ చర్యలు తీసుకుంటే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్ సూచిస్తున్నారు.

పరిమితికి మించి వాడరాదు

పంటను ఆశించిన తెగుళ్లు, పురుగుల నిర్మూలనకు పరిమితికి మించి మందులను వాడడం వలన మేలుకన్నా కీడే ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ శాఖ, శాస్త్రవేత్తలు పెస్టిసైడ్స్ దుకాణాదారుల సూచనలు పాటించాలి. జాగ్రత్త వహించకుంటే పంటకు మేలు చేసే సాలీడు, అక్షింతల పురుగులు మృత్యువాత పడుతాయి. మిత్ర పురుగులు పొలంలో లేకుంటే పంటకు కీడుచేసే పురుగుల ఉధృతి పెరుగుతుంది.

మందు ప్రభావానికి గురైతే..

- పురుగుల మందు ప్రభావానికి గురైతే వెంటనే సదరు వ్యక్తి నోట్లో వేలుపెట్టి వాంతి చేయించాలి.
- మూర్ఛపోయిన సందర్భంలో మూతికి గాయం కాకుండా రెండు దవడల మధ్య గుడ్డ ఉంచాలి.
- శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు తడిబట్టతో నెమ్మదిగా తుడవాలి. ఉష్ణోగ్రత తగ్గితే దుప్పటి కప్పి వెచ్చగా ఉంచాలి.
- సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లాలి. అనారోగ్యానికి కారణమైన రసాయనాల వివరాలు వైద్యునికి తెలపాలి.

అవగాహన అవసరం..

పంటలను ఆశించే చీడపీడల నివారణకు ఉపయోగించే పురుగు మందులపై రైతులు అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా దుకాణాల్లో పురుగు మందులు నాలుగు రంగుల్లో లభ్యమవుతాయి. వీటిలో పుర్రె గుర్తుతో ఉన్న రంగు, ఆకుపచ్చ, నీలి, పసుపు రంగులతో కూడిన డబ్బాలుంటాయి. పుర్రె గుర్తుతో కూడిన ఎర్ర రంగు ఉంటే అత్యంత విషపూరితమని గుర్తించాలి. ఆకుపచ్చ రంగు చిహ్నంతో తక్కువ విషపూరితం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- రసాయన మందు డబ్బా మూతను నోటితో తీయవద్దు. మందు ద్రావణాన్ని చేతితో కలపవద్దు.
- మందును ఒకేసారి కలుపుకోవాలి.
- పవర్ స్ప్రేయర్ నాజిల్‌ను పెద్దగా చేయరాదు. పిచికారీ సన్నగా తుంపరలా ఉండేలా చూడాలి.
- తగిన మోతాదులోనే మందు పిచికారీ చేయాలి. ఎక్కువైతే పంటలకు ప్రమాదం.
- ఒకేసారి రెండు లేదా మూడు మందులు కలిపి పిచికారీ చేయకూడదు.
- చేతులకు గ్లౌజులు, కళ్లజోడు, ముఖానికి మాస్క్ తలకు టోపీ, లేదా రుమాలు తప్పనిసరిగా ధరించాలి. చేతి వేళ్లకు గోళ్లు పెంచుకోకూడదు. పత్తిలో అయితే కాళ్లకు బూట్లు ధరించాలి.
- గాలికి ఎదురుగా పిచికారీ చేయకూడదు.
- పొగతాగడం తినడం, చేతులు నోట్లో పెట్టుకోవడం, కళ్లు నలుముకోవడం వంటి పనులు చేయవద్దు.
- పంట పెద్దగా ఉన్నప్పుడు చేతి పంపుతో కాకుండా స్ప్రేయర్‌తోనే పిచికారీ చేయాలి.
- కొన్ని మందులను మాత్రం పవర్ స్ప్రేయర్‌తో పిచికారీ చేయకూడదు.

అవి గాలిలో కలిసి ఇతర పంటలపై పడితే పంట నాశనమై పోతుంది. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి.

- గాయాలైన చేతులతో మందు పిచికారీ చేయరాదు. పిచికారీ పూర్తయిన వెంటనే కాళ్లు, చేతులు సబ్బుతో కడుక్కోవాలి. తలస్నానం చేయాలి.
- ప్రత్యేకమైన దుస్తులను మాత్రమే వినియోగించాలి. వాటిని మిగతా దుస్తులతో కలిసి ఉతకొద్దు.
- చిన్నపిల్లలకు పురుగు మందులను సాధ్యమైనంత దూరంగా ఉంచాలి.
- పిచికారీ అనంతరం మందు డబ్బాలను గోతీ తీసి పాతిపెట్టాలి.

సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక



ఎంపికైన భీంరావు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని దేవాపూర్ గ్రామానికి చెందిన ఎస్.భీంరావు ఈ నెల 11 నుంచి 14 వరకు తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్‌లో నిర్వహించనున్న సౌత్‌జోన్ మెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ తెలిపారు. జూన్‌లో రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో ప్రతిభ కనబర్చడంతో సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. భీంరావును ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేష్, చీఫ్ అడ్వైజర్ గాజుల ముఖేష్‌గౌడ్, ఉపాధ్యక్షులు భాస్కర్లవాసు, బండ మీనారెడ్డి, కోశాధికారి సత్యపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ రమేశ్‌రెడ్డి, తదితరులు అభినందించారు.

13న జిల్లా ఫుట్‌బాల్ సెలెక్షన్స్

రామకృష్ణాపూర్(చెన్నూర్): రామకృష్ణాపూర్‌లోని ఠాగూర్ స్టేడియంలో ఈ నెల 13న జిల్లాస్థాయి మెన్ ఫుట్‌బాల్ సెలెక్షన్స్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో హాజరుకావాలని కోరారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19 నుండి 23 వరకు వనపర్తి జిల్లా పెబ్బేరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇంజనీరింగ్‌లో మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్

నస్పూర్(మంచిర్యాల): మంథని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ (సూపర్ న్యూమరి)లో మిగిలిన సీట్లకోసం ఈ నెల 14న చివరిదశ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా పర్సనల్ డీజీఎం అరవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారుల పిల్లలకు 14 సీట్లు, ఉద్యోగుల పిల్లలకు 12 సీట్లు ఉన్నాయన్నారు. 14న ఉదయం పది గంటలకు జేఎన్టీయూలో నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు విద్యార్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఉద్యోగి ఐడెంటిటీ కార్డు వెంట తీసుకువెళ్లాలని సూచించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలం



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

బెల్లంపల్లి: విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్ విమర్శించారు. గురువారం బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ , స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేయకపోవడంతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్నాయన్నారు. రూ.5,500 కోట్ల బకాయిలు ఉన్నా సీఎం కేసీఆర్ స్పందించడం లేదన్నారు. ప్రభుత్వ కళాశాలలకు ప్రహరీలులేక ఆకతాయిలకు అడ్డాలుగా మారుతున్నాయన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆసీస్, రాజేశ్, బిట్టు, మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు.

‘గుర్తింపు’ ఎన్నికలు వెంటనే నిర్వహించాలి



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

మందమర్రిరూరల్: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల కాలపరిమితి ముగిసి మూడేళ్లు కావస్తున్నా ప్రభుత్వం పలు సాకులు చెప్పి వాయిదా వేస్తోందన్నారు. ఎన్నికలు నిర్వహించేంత వరకు అన్ని కార్మిక సంఘాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, వచ్చే నెల వేతనాలతో సింగరేణి లాభాల వాటా ఉద్యోగులకు పంపిణీ చేయాలని, సీఎస్‌ఆర్ నిధులపై యాజమాన్యం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రమేశ్, ప్రదీప్‌కుమార్, రవీందర్, వీరన్న, రజినీకాంత్, శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడేది ఏఐటీయూసీ



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

కాసిపేట(బెల్లంపల్లి): సింగరేణిలో కార్మికుల హక్కుల కోసం పోరాడేది ఏఐటీయూసీ మాత్రమేనని బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ పేర్కొన్నారు. గురువారం కాసిపేట 2 గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25, 26, 27 తేదీలలో గోదావరిఖనిలో జరుగనున్న 16వ కేంద్ర మహాసభల్లో భవిష్యత్ ఉద్యమాలకు తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ నుంచి హెడ్ ఓవర్‌మెన్ మొయినొద్దీన్, 53 మంది కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, పిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి సీఎం కేసీఆర్

- టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి



ఐకే 1ఏ గనిపై మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

జైపూర్(చెన్నూర్): ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికుల పక్షపాతి అని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక కార్మికుల కలలు సాకారం అవుతున్నాయని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి అన్నారు. జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గని, ఐకే–ఓసీపీపై గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కారుణ్య నియామకాల ద్వారా 15 వేల మందికి ఉద్యోగాలు, కార్మికుల సొంతింటి నిర్మాణానికి రూ.10 లక్షల వడ్డీలేని రుణం, కార్మికుల క్వార్టర్లకు ఏసీ సౌకర్యం, తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం, రూ.700 కోట్ల లాభాలను కార్మికులకు పంచబోతున్నట్లు తెలిపారు. సమావేశంలో టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్, జగదీశ్వర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రమేశ్, గడ్డం మల్లన్న, రత్నాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ రికార్డులు పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న చిరంజీవి

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గోలేటి జీఎం కార్యాలయంలో సింగరేణి ఉద్యోగుల సీఎంపీఎఫ్ రికార్డులను గురువారం సీఎంపీఎఫ్ ఇన్స్‌పెక్టర్ పి.చిరంజీవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సీఎంపీఎఫ్ ఖాతాల్లో ఉండే డబ్బుల వివరాలను ఇకమీదట ఈ పోర్టల్(http:// cmpf. gov. in)లో సులువుగా తెలుసుకోవచ్చన్నారు. అనంతరం ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో పలు రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహెర, తదితరులు ఉన్నారు.

పాఠశాలలో కూలిన పైకప్పు



కుర్మగూడెం పాఠశాలలో కూలిన పైకప్పు

భీమిని: కన్నెపల్లి మండలంలోని కుర్మగూడెం ప్రాథమిక పాఠశాలలో గురువారం పైకప్పు కూలింది. విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి బయటకు వెళ్లిన సమయంలో కూలడంతో ప్రాణాపాయం తప్పింది. దీంతో ఉపాధ్యాయులు ఆరుబయట చెట్ల కింద విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఇప్పటికైనా పాఠశాలకు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడనే...

- హత్య కేసు ఛేదించిన పోలీసులు
- ఇద్దరు నిందితుల అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, చెప్పులు

తాండూర్(బెల్లంపల్లి): మండలంలో బుధవారం జరిగిన హత్యకేసును 24 గంటలు గడవక ముందే పోలీసులు ఛేదించారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ మండలం అచ్చులాపూర్ గ్రామానికి చెందిన సిద్దం శ్రీనివాస్ (40) భార్య బానక్కతో తాండూర్‌కు చెందిన మేడి శంకర్ వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ విషయమై దంపతుల మధ్య గొడవలు జరుగుతుండడంతో తమ అక్రమ సంబంధానికి అడ్డువస్తున్నాడని, ఎలాగైనా అతన్ని చంపాలని బానక్క ప్రియున్ని పురమాయించింది. పథకం ప్రకారం బురదలో పడి ఉన్న శ్రీనివాస్ తలపై శంకర్ కాలుతో గట్టిగా అదిమిపట్టి హత్య చేశాడు. ఇందుకు బానక్క సహకరించింది. మృతుని తల్లి సిద్దం మొండక్క ఫిర్యాదుతో నిందితులు శంకర్, బానక్కను అదుపులోకి తీసుకుని విచారించడంతో నేరాన్ని అంగీకరించారు. ఇరువురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి 3 సెల్‌ఫోన్లు, ఓ బైక్ , హత్య చేసిన సమయంలో ధరించిన దుస్తులు, చెప్పులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. 24 గంటల వ్యవధిలో కేసును ఛేదించిన సీఐ శ్రీనివాసరావు, ఎస్సై రాజశేఖర్‌ను డీసీపీ, ఏసీపీ అభినందించారు.

వివాహిత దారుణ హత్య

- మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఘటన
- భర్తే హత్య చేయించాడని కుటుంబ సభ్యుల ఆరోపణ



భర్త, కూతురుతో శరణ్య (ఫైల్)



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గోపాల్‌వాడ రైల్వే ఏ క్యాబిన్ సమీపంలో ఓ మహిళ దారుణహత్యకు గురైన సంఘటన సంచలనం సృష్టించింది. గోపాల్‌వాడకు చెందిన బత్తిని శరణ్య (27) స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తోంది. గురువారం విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన శరణ్య రైల్వే ట్రాక్ పక్కనే రక్తపుమడుగులో పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి సందర్శించారు. పోలీసులు ఘటన స్థలంలో మృతురాలి సెల్‌ఫోన్, గొడుగు, హ్యాండ్‌బ్యాగ్, రక్తపు నమూనాలు, ఫింగర్ ప్రింట్స్ సేకరించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ రాజు తెలిపారు.

భర్తే హత్య చేశాడు..

శరణ్యను ఆమె భర్తే హత్య చేశాడని తల్లి లక్ష్మి, సోదరి శ్రావణి ఆరోపిస్తున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పన్నెండేళ్ల క్రితం గోపాల్‌వాడకు చెందిన సయ్యద్ జియా ఉల్‌హక్‌ను శరణ్య ప్రేమ వివాహం చేసుకుంది. సయ్యద్ సీఐఎస్‌ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. దంపతులకు ఒక కూతురు సంతానం. ఆరేళ్ల తర్వాత సయ్యద్ ఉద్యోగం చేస్తున్న ప్రాంతంలో మరో యువతితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీంతో దంపతుల మధ్య గొడవలు మొదలయ్యాయి. శరణ్య సద్దుపై కేసు పెట్టింది. ఇది కోర్టులో కేసు కొనసాగుతోంది. ఆరేళ్లుగా ఇద్దరూ దూరంగా ఉంటున్నారు. పదిరోజుల క్రితం సయ్యద్ ఫోన్‌చేసి విడాకులు ఇస్తావా? లేదంటే చంపేస్తానని బెదిరించాడని శరణ్య కుటుంబ సభ్యులతో వాపోయింది. దీంతో భర్తే హత్యచేసి ఉంటాడని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షురాలిగా చిదానంద కుమారి



నియామకపత్రం అందుకుంటున్న కుమారి

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా మంచిర్యాలకు చెందిన చిదానందకుమారిని నియమించారు. గురువారం హైదరాబాద్‌లో మహిళా విభాగం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రానికి చెందిన గంప వాణిని రాష్ట్ర నిర్వాహక కార్యదర్శిగా, బాల విజయను రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు.

ఇద్దరు యువకులపై దాడి

- ఫ్లెక్సీ ఏర్పాటు విషయంలో గొడవ



గాయపడిన వరప్రసాద్



సాగర్

బెల్లంపల్లి: ఫ్లెక్సీల ఏర్పాటులో జరిగిన గొడవలో ఇద్దరు యువకులపై దాడి చేసిన ఘటన గురువారం రాత్రి బెల్లంపల్లిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం...బీఎస్పీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లపల్లి వరప్రసాద్ కన్నాల చౌరస్తాలోని హన్మాన్ విగ్రహం ఎదుట ఉన్న ఫ్లెక్సీ బోర్డుపై పార్టీ ప్రచారం కోసం ఫ్లెక్సీని ఏర్పాటు చేసుకున్నాడు. నెల రోజుల పాటు ఉండేలా యాడ్ ఏజెన్సీతో ఒప్పందం చేసుకున్నాడు. అయితే అదే ఫ్లెక్సీపై ప్రధాన రాజకీయ పార్టీ అనుబంధ యువజన సంఘం నాయకుడు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో వరప్రసాద్ వచ్చి చించివేశాడు. విషయం తెలుసుకున్న సదరు యువజన సంఘం నాయకుడి అనుచరులు వరప్రసాద్, అతని వెంట ఉన్న రెబ్బెనకు చెందిన జాడి సాగర్‌పై మూకుమ్మడిగా దాడి చేయడంతో ఇరువురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకునేలోగానే దాడికి పాల్పడిన యువకులు పారిపోయారు.

మెరుగైన వేతనాలు చెల్లించాలని ధర్నా



ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

నస్పూర్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు మెరుగైన వేతనాలు చెల్లించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.బ్రహ్మానందం డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జీఎం కార్యాలయంలో డీజీఎం పర్సనల్ అరవిందరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు కోలిండియా వేతనాలు చెల్లించాలని, కార్మికుడు ప్రమాదవశాత్తు చనిపోతే యాక్సిడెంట్ బెనిఫిట్ కింద రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, ఈఎస్ సౌకర్యం కల్పించాలని, ఖాళీగా ఉన్న క్వార్టర్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. నాయకులు యాదగిరి, గొట్టె శ్రీనివాస్, శోభ, మల్లేశ్, రాజకళ, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.